

# కథా కౌముది

## అవ్యక్తం

ఎమ్.విజయశ్రీముఖి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

అదొక పల్లెటూరు. ఒక పెంకుటింటి ముందు ఆగింది కారు.

"ఇదే ఇల్లు, దిగు అవ్యా!"

ప్రక్కనున్న భార్య మీదుగా చేతిని చాపి, కారు డోరు తీస్తూ చెప్పాడు వేణుగోపాల్.

పెళ్లయిన ఈమూడేళ్లలో ఈ ఊరుకు రావడం అవ్యక్తకు ఇదే మొదటిసారి.

'అరే! ఇల్లు తాళంవేసి ఉందేంటి!' అంటూ ప్రక్కింటి అరుగు మీద గోగునారతో నులక పేనుకుంటూ కూర్చున్న పెద్దాయనని చూసి పలకరిస్తూ "తాతా! బాగున్నావా? మాపిన్నీ బాబాయ్ ఎక్కడికెళ్లారు... ఇంటికి తాళంపెట్టి ఉంది?" అడిగాడు వేణుగోపాల్.

తలెత్తి చూసిన ఆ పెద్దాయన

"ఓర్నీ! నువ్వా గోపాలూ.. బాగుండా వాయ్యా? మా మనవరాలుని కూడా తీసుకొచ్చినట్టుండావుగా..మీ వోళ్ళు పెద్దచెరువు కాడున్న నాలుగెకరాలు ఏరుశనగేశారుగా? అది కాయకోతకి వెళ్ళినట్టుండారు... రాండి..మంచినీళ్లు తాగుదురుగాని" చెప్పాడు పెద్దాయన చేతిలో నులక పక్కన పెడుతూ.

"వద్దులే తాతా! కార్లో నీళ్ల బాటిల్స్ ఉంటే తాగుతూనే ఉన్నాం. సరే.. చేను నాకుతెలిసిందేగా చూసికూడా చాన్నాళ్ళయింది. అటు వెళ్లివస్తాం" చెప్పేసి వెనుతిరిగాడు వేణుగోపాల్.

వింటూనే ఉంది అవ్యక్త.

కారు స్టార్ట్ చేస్తూ చెప్పాడు

"చిన్నప్పుడు ఇవన్నీతిరిగినవే... మనం ఎటూ సాయంత్రం వెళ్ళాలి కాబట్టి..చేలోనే కాసేపు గడిపి,పలక రించి వెళ్ళిపోదాం!"

ముభావంగా ఊరుకుంది అవ్యక్త.

కారు ఊరి దాటి..పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు మీదకు వచ్చింది.

★★★★

ఒక జిల్లావిద్యాశాఖాధికారికి కూతురుగా పుట్టిన అవ్యక్త బాల్యం, చదువు ఎదుగుదలఅంతా పట్నంలో గడిచింది.

వేణుగోపాల్ పుట్టింది ఒక మేజర్ పంచాయతీ గ్రామంలో.

అతనిచదువు పూర్తయి, సాఫ్ట్వేర్ ఉద్యోగం పూణేలో రావడంతో,పెళ్లి అయి కాపురానికి అక్కడికే వెళ్ళింది అవ్యక్త.

ఆమెకు పల్లెటూర్లలోని మోటు మాటలు, మేనర్స్ పాటించని పల్లె జనం అంటే విముఖత అని భర్తకు తెలుసు. ఇష్టం లేకపోయినా, తప్పక వస్తుందని కూడా తెలుసు అతనికి.

చిన్నప్పుడు ప్రతి సంవత్సరం సెలవులకువచ్చి ఇక్కడున్న అమ్మ చెల్లెలు పిన్నీ, బాబాయ్ ల దగ్గర గడిపి వెళ్లేవాడు వాళ్ల పిల్లలతో.

ఇప్పుడు అమ్మ నాన్నలను చూడటానికి వచ్చి, ఇక్కడికి రాకుండా వెళ్ళడానికి మనస్కరించ లేదు.

★★★★

కారును డొంకలోఆపి లాక్ చేస్తూ,

"అదిగో చుట్టూ చెట్లు, మధ్యలో మనుషులు కనిపిస్తున్నారే... అదే పిన్నివాళ్ళ పొలం!"

అంటూ మడుల మధ్యనున్న సన్నని గట్ల మీదుగా నడిచివెళ్లారు.

చేనుచేరాక చేనుగట్టు మీదే నిలబడి చుట్టూ పరికించి చూడసాగారు అవ్యక్త, వేణుగోపాల్.

నాలుగెకరాల మేర వేరుశనగ పంటవేసిన చేను, చేనుచుట్టూ దడి కట్టినట్లుగా తాటిచెట్లు, మధ్యమధ్య వేప, సీతాఫలంచెట్లతో పచ్చగాఉంది

చేలో సాళ్లు సాళ్లుగా ఎదిగిపోయి, గుమ్మటంగా కనిపిస్తున్న కందిచెట్లు, మధ్యలో గుత్తులు గుత్తులుగా ఉన్న కాయలతో వేరుశనగ మొక్కలు పీకి పనలు పనలుగా వేసి ఉన్నాయి...

'అందమైన సెట్టింగ్ లా ఉంది!' మనసులోనే అనుకుంది అవ్యక్త.

కొందరు ఆ ఎండలోనే, మరికొందరు కందిచెట్లు మధ్యనున్న నీడలోను కూర్చుని కాయలు కోసి బుట్టలలో వేస్తున్నారు.

చేనంతా మనుషులతోనూ, వాళ్ళ మాటలతోనూ సందడిగా ఉంది.

"ఎవరు బాబు.. ఎవరు కావాలి?"

దాదాపు ముప్పైఏళ్లు వయసున్న ఒకవ్యక్తి లుంగీ, బనీను తలగుడ్డతో ఉండి అడుగుతున్నాడు

"మీనాక్షిపిన్ని, సాంబయ్య బాబాయ్ ఏరి?" అడిగాడు వేణుగోపాల్

"ఓ.. ఆరి తాలుకానా! ఉండండైతే...ఓ...పెద్దమ్మగారో ! ఎవరో వచ్చారు రాండి." పెద్దగా అరిచాడు అతను

చటుక్కున చెవులు మూసుకుంది అవ్యక్త ఆతని అరుపుకి.

ఆమె చూపుల్లోని విసుగును చూసి.. మెల్లగా చెప్పాడు వేణుగోపాల్. "అలా అరిస్తేనే చేలల్లోదూరాన ఉన్న వాళ్లకు వినిపిస్తుంది మరి" అని.

"ఓరి వేణూ! నువ్వా? అబ్బో... మా కోడలు కూడా వచ్చిందిగా! ముందుగా తెలియచేస్తే ఇంటిదగ్గరే ఉండేదాన్ని కదా... అయ్యో, ఇక్కడ దాకా వచ్చారు ఎండలోపడి" మీనాక్షి వాళ్ళనిచూసి సంబరపడినా నొచ్చుకుంటూ అంది.

"పర్వాలేదు పిన్నీ! ముందు చెప్ప కుండా మిమ్మల్ని సర్ప్రైజ్ చేద్దామని వచ్చాం. బాబాయ్ ఏరి?"అడిగాడు.

"బాబాయ్ పనిఉండి, పక్క ఊరికి వెళ్లారు. పనిచూసుకుని వచ్చేస్తారు"

"అలాగా!"

"ఏమ్మా! నిన్ను పొలానికి లాక్కుని వచ్చాడా? మీ అమ్మ నాన్నగారు బాగున్నారా? పదండి ఇంటికెల్దాం" అంది మీనాక్షి.

"పర్వాలేదు లెండి, మీరు మాతో వచ్చేస్తే ఎలా? మావయ్యగారు కూడ లేరుకదా? కాసేపు కూర్చొని వెళ్తాం. రాత్రికి మా ప్రయాణం ఉంది" మర్యాదగానూ ,మొహమాటంగాను చెప్పింది అవ్యక్త.

'హమ్మయ్య ' అనుకున్నాడు వేణు.

"పొద్దు నెత్తిమీదకు వచ్చింది. అదిగో అందరూ అన్నాలకు లేస్తున్నారు. పదండి ఇంటికి... చిటికెలో వంట చేస్తాను" అంటున్న మీనాక్షి నాపుతూ

"పిన్నీ,అంత టైంలేదు గానీ, నువ్వు భోజనం తెచ్చుకున్నావా?" అడిగాడు వేణు.

"తెచ్చుకున్నానులే..మీరు పదండి" తొందరించింది మీనాక్షి.

"నేను చెప్పేదివిను పిన్నీ! చేలల్లో అన్నంతిని చానాళ్లు అయింది.ఎంత సరదాగా ఉంటదో తెలుసా! ఏది.. నీ క్యారేజీ?" అడిగాడు.

"అయ్యో!మీ ఆవిడ నవ్వుతుందిరా"

"పెద్దమ్మగారు! మీ అన్నం టిపిని, మంచినీళ్లు ఇయిగోండీ"

మీనాక్షి క్యారేజీని,మంచినీళ్లు కడవ ఒక లోటా తెచ్చి అక్కడ పెట్టాడు ఇందాకటి వ్యక్తి.

"నీ పేరేంటి?" అడిగాడు వేణు

"నాపేరు పరమేశంఅండి, మా ఆవిడ పేరు జోతి!" చెప్పాడు అతను.

"మా వాడడిగింది నీపేరే రా..ఇదిగో వేణూ! వీడేమో తనపేరుతో పాటు అడగక పోయినా పెళ్లాం పేరు చెప్తాడు, ఆ పిల్లేమో తన పేరుతో పాటు వీడిది కూడా చెబుతుంది..ఇదీ వీళ్ళవరస" నవ్వుతూ చెప్పింది మీనాక్షి.

అవ్యక్త మోములో చిరునవ్వు తప్ప, విసుగు కనిపించలేదు.

చేలో కాయలు కోసే తల్లులతో పాటు ఏడెనిమిది,పదేళ్ల వయసున్న పిల్లలు కూడా ఉన్నారు.

"ఇదేంటి కాయలన్నీ ఇలా క్రిందనే రాశులు రాశులుగా పోశారు?" అడిగింది అవ్యక్త.

"దాన్ని కల్లం అంటారమ్మ. కొంతమేర శుభ్రంచేసి, వచ్చిన వాళ్ళందరూ వాళ్ళు సాయంత్రం వరకు కోసిన కాయలన్ని విడిగా గుర్తుగా ఒకచోట కుప్పగా పోస్తారు. సాయంత్రం వేళ ఎవరెన్ని కోశారో కొలిసి, వాటిని బట్టి డబ్బులు ఇస్తాం.అంతేగాక,ఇవి తినే కాయలు కదా.. వెళ్ళిబోయే ముందు తలాకాసిని శనక్కాయలు కూడా పెడతాం. కూలిడబ్బులకన్నా కూడా కాయలమీద ఆశతోనే వస్తారసలు... ఇలా కోతలు కోసి పోగేసుకున్న కాయల్ని ఎండబెట్టి దాచుకుంటే ఏడాది అంతా పిల్లాజెల్లా తినటానికి ఉంటాయి వాళ్ళకు" వివరంగా చెప్పింది మీనాక్షి.

"అబ్బ! ఎన్నాళ్లకు మళ్ళీ పొలంలో అన్నం తినబోతున్నాను!" సంబరంగా అన్నాడు వేణుగోపాల్

"పెద్దమ్మగారు.. ఇదిగో, కంచె పక్కాటున ఏపచెట్టు కింద మేము ఓదెలు ఏసుకుని కూచ్చున్నామే... ఈనీడలో తిందురు రాండి. జోతీ! ఆరి టిపినిని, నీళ్ల కడవ ఎత్తుకురా" అరిచి చెప్పాడు పరమేశం.

వీళ్లక్కడికి వెళ్లేసరికి పరమేశం కాయలు కోసేసిన ఖాళీ మొక్కలు ఒక మోపెడు ఒత్తుగా పరిచి, పైన కాయలు నింపటానికి తెచ్చిన గోనె సంచులు వేశాడు.

"కూకోండి, మెత్తగా పరుపులాగా ఉంటది" నవ్వుతూ చెప్పాడు.

"కారులో పళ్ళున్నాయి పిన్నీ! తెస్తానుండు"

వెళ్ళబోతున్న వేణును ఆపింది మీనాక్షి "ఇప్పుడు అవేం వద్దులే, అన్నం ఎక్కువే తెచ్చాను. ఈ వేరు శెనగకాయల కోతలకు పిల్లల్నికూడా తీసుకొస్తారు. వాళ్లక్కూడా కాసిని కాయలు పెట్టమని.ఎవరికైనా అన్నం తక్కువయితే పెట్టొచ్చని తెస్తాను"

స్టీల్ క్యారియర్ తీసింది. రెండుగిన్నె లలో అన్నం, ఒకగిన్నెలో పప్పు,దాని లోనే చిన్నగిన్నెలోఉన్న పండుమిరప కాయల పచ్చడి. నాలుగో దానిలో పెరుగన్నం ఉంది. పచ్చడిమీద వేసిన వెన్నపూస ఎండ వేడికి కాబోలు కరిగిపోయి ఉంది.

"ఓహో...వివాహ భోజనంబు!" నవ్వుతూ లొట్టలు వేశాడు వేణు.

"పిన్నీ! ఒకగిన్నెలో అవ్యకు పెట్టు. మిగతాది కలిపి నువ్వు తింటూ, నా చేతిలో ముద్దలు పెట్టు" అంటూ దోసిలి పట్టాడు.

మితభాషిగా, సాఫ్ట్వేర్ ఉద్యోగిగా.. హుందాగా ఉండే వేణుగోపాల్ గాక, ఈ పరిసరాలలో చిన్నపిల్లాడి లాగా, పంజరం వీడిన పక్షి రెక్కలుసాచి స్వేచ్ఛగా ఎగురుతున్నంత హాయిగా సంబరపడిపోతున్న అసలైన వేణు కనిపిస్తున్నాడు అవ్యక్తకు.

"పిన్నీ! తమ్ముడు చెల్లి ఎలాఉన్నారు? ఫోన్లు చేస్తున్నారా?"

"బాగానే ఉన్నారు. అయినా మీరు మీరు మాకన్న ఎక్కువగా మాట్లాడు కుంటారుగా?"

"అవును. మీ అక్క చెల్లెళ్లిద్దరూ మాట్లాడుకుంటున్నట్టు" అన్నాడు. నవ్వుకున్నారు.

కాస్త ఎడంగా కూర్చున్న పరమేశం జ్యోతికూడా అలాగే తింటున్నారు.

"ఇదేంటి..మగవాళ్ళు కూడా ఇలా ఆడవాళ్ళ లాగా కూర్చుని చేసే పనులకే వస్తారా ?"అడిగింది అవ్యక్త పరమేశాన్ని చూపిస్తూ.

మీనాక్షి ఒకసారి అటు చూసి,ఇటు అవ్యక్తతో చెప్పింది,

"వీళ్లోవింతజంట అమ్మా! ఏంచేసినా ఇద్దరూఒకేపనికి ఒక్కచోటకేపోతారు. ఈ పొలం పనులు లేకపోతే.. బేల్దారి పనులకు వెళతారు, నాట్లు కోతలు దేనికైనా..ఆడపనని వాడు, మగపని అని ఆ పిల్లా అనుకోరు...

మాచిన్నప్పుడు రేడియోలో ఒక ప్రకటన వచ్చేది "లైఫ్ బాయ్ ఎక్కడ ఉందో ఆరోగ్యం అక్కడ ఉంది" అని. ఆ బాపతు వీళ్ళు!"

"ఎందుకలా? పెళ్ళాం మీదనుమాన మా?" అడిగింది అవ్యక్త.

"ఈ మాటే ఒకసారి ఎవరో అని వెక్కి రిస్తుంటే వాళ్లేమన్నారో తెలుసా?

' ఎప్పుడు సచ్చిపోతామో తెలీదు... బతికిన నాలుగురోజులు మేవు కల్సే ఉంటాం..ఎవరెన్ననుకుంటే మాకేం? అని" చెప్పింది మీనాక్షి

అప్రయిత్నంగా ఒకరినొకరు చూసు కున్నారు వేణు, అవ్యక్త.

"ఏంటమ్మగారూ...మా ఊసేనా?"

మీనాక్షి మాటలు వినిపించి అడిగింది జ్యోతి.

"ఆ...నీ ఊసే. నువ్వో పెదానమంత్రి వని..తినెహే" కసిరాడు పరమేశం.

"సరేలేగాని జ్యోతి...ఇవాళ పండగ కూడాకాదే... నువు తలంటుకుని, కొత్తచీరా..కాళ్లకు పసుపూ,కుంకుమ బొట్లుతో వచ్చావ్.. ఏంటి కథ?" నవ్వుతూ అడిగింది మీనాక్షి.

జ్యోతి మగడిని చూసి నవ్వుతూ "చెప్పు" అంది

"నువ్వే చెప్పరాదూ" అన్నాడు పక్కకుతిరిగి చేయికడుగు కుంటూ పరమేశం

"నీ యబ్బ! పెళ్ళయిన రోజని చెబుతానికేమొచ్చే నీకు? అదీ నేనే చెప్పాల్నా?"

అన్నం గిన్నెలు సర్దుకుంటూ తేలిగ్గా అనేసిన జ్యోతిని చూసి ఆశ్చర్యంగా నోరు తెరిచింది అవ్యక్త.

"ఓసి నీఅయ్య! నా అబ్బను తలవక పోతే తిన్నాది అరగదేంటే నీకు?" తలకు చుట్టుకున్న తుండును తీసి చెయ్యి, మూతి తుడుచుకుంటూ అన్నాడు పరమేశం

"అయ్యా గియ్యా అని మా బాబుని అన్నావంటే చూడు మల్ల.." ఖయ్యిమంది జ్యోతి.

తినడంఆపి వాళ్ళవైపే చూస్తున్నారు వేణు, అవ్యక్త.

"ఓరి మీ దుంపతెగ! అరుచుకో బాకండి. ఐనా,గడుసుదనం కాపోతే నువ్వనొచ్చుగానీ, వాడనగూడదా?" జ్యోతిని అడిగింది మీనాక్షి.

"ఆళ్ళ నాన నాసొంత మేనమావ. నా మేనమావని తిట్టుకునే అక్కు నాకుంది. మా అయ్యని అనొద్దు. కావాలంటే మాయమ్మ ఆడి మేనత్తే గా...దాన్ని అనుకోమనండి"

"నా మేనత్తని నేనెందుకంటానే? నిన్ను నా పీకకి కట్టిన నీ బాబుని అంటాను గాని.."

వాళ్ళగొడవకు అవ్యక్త పొలమారేలా నవ్వడంతో వేణు భార్యతలపై తట్టి, మంచినీళ్లు అందించాడు.

"ఇంతకీ మీ పెళ్లయి ఎన్నేళ్లు?" అడిగాడు వేణుగోపాల్

"తొమ్మిదేళ్ళయ్యా, ఏడేళ్ళ పిల్ల, ఐదేళ్ల పిల్లోడు ఉండారయ్యా" చెప్పాడు పరమేశం

ఎందుకో మళ్లీ ఒకరినొకరు చూసు కున్నారు వేణు, అవ్యక్త.

పొద్దు వాటారుతోంది...

అప్పుడే వచ్చాడు సాంబయ్య వీళ్ళను చూసి ఆనందపడ్డాడు.

"మీరు మాట్లాడుతూ ఉండండి..." అంటూ వెళ్ళింది మీనాక్షి.

మరి కాసేపు మాట్లాడాక వేణు "ఇంక వెళ్తాము బాబాయ్!" అంటూ లేచాడు.

"ఉండండయ్యా... పొలానికి వచ్చి, పొలం నుంచే వెళ్తామంటున్నారు... ఇంటికి వెళ్దాం పదండి" అన్నాడు సాంబయ్య.

"లేదుబాబాయ్, పెళ్లప్పుడు చూశా, ఒకసారి చూసి పోదామని వచ్చాం.. ఈ రాత్రికే ప్రయాణం ఉంది"

సాంబయ్య పరమేశాన్ని పిలిచి ఒక గోనెసంచినిండా వేరుశనగ కాయలు నింపించి దబ్బనం పురికొసతో సంచి కుట్టించాడు.

అంతలో మీనాక్షి ఒక చిన్నతుండు లో కట్టిన మూటను, స్టీల్ క్యారేజీని తెచ్చి జ్యోతికి అందిస్తూ చెప్పింది "కాయలబస్తాతోపాటు వీటిని కూడా కారులో పెట్టండి" అని.

"అవి ఏంటి పిన్ని?" అడిగాడు వేణు

"చేలో అక్కడక్కడ గోగువిత్తులు జల్లాం రా!మూటలోది గోంగూర, ఇవి తంపటేసిన శనక్కాయలు, కారులో తినండి" చెప్పిందామె.

వేణు అవ్యక్తలతో పాటు, మీనాక్షి సాంబయ్య కూడా కారు దగ్గరకు వచ్చారు. వేణు డిక్కీతీస్తే, పరమేశం తెచ్చినవి అందులో పెట్టాడు.

వేణు కారులో ఉన్న స్వీట్ బాక్సు్లు, పండ్లుసంచి తీసి పిన్నికిస్తూ ఒక స్వీట్ బాక్స్ ని పరమేశం చేతుల్లో పెట్టీ, "మీపెళ్లిరోజు శుభాకాంక్షలు!" నవ్వుతూ చెప్పాడు.

పరమేశం పరమ సంతోషంగా నవ్వుతూ "అట్టాగే బాబు" అంటూ,

"అప్పుడప్పుడు రాండి బాబూ... అమ్మాయిగారిని కూడా తీసుకుని" చెప్పాడు.

"తీసుకురాక? నీలాగా వదిలేసి తిరుగుతారనుకున్నావా?" మోచేత్తో మొగుడిని పొడుస్తూ అంది జ్యోతి.

"నేను నిన్నేడ వదిలేసానే? నువ్వు నన్ను..నీఅయ్యేవో మా అత్తనీ ఏడు జల్మలనుండీ యేటాడుతుంటిరిగా?" అన్నాడు పరమేశం

"మళ్లీ మొదలు పెట్టారా?"

మందలింపుగా నవ్వుతూ అంది మీనాక్షి. అందరూ నవ్వారు.

అవ్యక్త తన హ్యాండ్ బ్యాగ్ లో నుండి రెండువందల రూపాయల నోటు తీసి నవ్వుతూ "ఇది ఉంచు" జ్యోతి చేతుల్లో పెట్టింది.

"అయ్యో వద్దమ్మ గారు"

మొహమాటంగా అంటున్న జ్యోతితో "వద్దనకు, తీసుకుని నువు గాజులు వేయించుకో!" చెప్పింది మీనాక్షి.

వాళ్లదగ్గర వీడ్కోలు తీసుకుని, బైలు దేరారు అవ్యక్త వేణుగోపాల్. కారు సాగిపోతోంది..ఎండలో వేడిమి తగ్గిపోయింది. చుట్టుపక్కలున్న పచ్చనిచేలు చెట్లపై నుంచి వస్తున్న చల్లని స్వచ్ఛమైన పైరుగాలి ఆహ్లాదంగా ఉంది.

వేణు తలతిప్పి భార్యవైపుచూసాడు. వచ్చేప్పుడు ఆమె మొహంలో కనిపించిన విసుగు అసహనం లేవు ప్రసన్నంగా ప్రశాంతంగా కనిపిస్తోంది.

అలసట తీర్చినట్లుగా ఉన్న ఏదో అవ్యక్తమైన భావనతో... డ్రైవింగ్ చేస్తున్న భర్త భుజంపై నెమ్మదిగాతన తలను ఆన్చింది అవ్యక్త.

చేతులు డ్రైవింగ్ వీల్ మీదనేఉంచి, తల ప్రక్కకువంచి మృదువుగా ఆమె తలను స్పృశించాడు వేణుగోపాల్.

★★★

COMMENTS